# నల్లగొండలో రికార్డు స్థాయి మెజార్టీ

- మహబూబ్‌నగర్‌లో డీకే అరుణకు అత్యల్ప మెజార్టీ
- భారీ ఆధిక్యంతో గెలుపొందిన పలువురు అభ్యర్థులు
- తొలి నుంచి ఉత్కంఠరేపిన మెదక్, పాలమూరు ఫలితాలు

హైదరాబాద్, జూన్ 4 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో పలువురికి రికార్డు స్థాయి మెజార్టీని సాధించారు. 17 స్థానాల్లో కాంగ్రెస్, బీజేపీ చెరో 8 స్థానాలు గెలుపొందగా, ఎంఐఎం తన సిట్టింగ్‌గ స్థానాన్ని నిలుపుకున్నది. నల్లగొండ నుంచి కాంగ్రెస్ అభ్యర్థి కుందురు రఘువీర్‌రెడ్డి రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీతో విజయం సాధించారు. ఆయన 5,59,905 మెజార్టీ వచ్చినట్టు ఎన్నికల సంఘం ప్రకటించింది. మహబూబ్‌నగర్ నుంచి బీజేపీ అభ్యర్థి డీకే అరుణ 4,500 ఓట్ల అతి తక్కువ మెజార్టీతో గెలుపొందారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన ఓట్ల లెక్కింపులో మహబూబ్‌నగర్, మెదక్ స్థానాల లెక్కింపు అత్యంత ఉత్కంఠభరితంగా సాగింది. ఈ రెండు స్థానాల్లో చివరి వరకు ఫలితం దోబుచులాడింది. మెదక్ స్థానంలో మొదట్లో బీఆర్‌ఎస్, బీజేపీ అభ్యర్థుల మధ్య అతి తక్కువ ఓట్ల వ్యత్యాసంతో ఓట్ల లెక్కింపు సాగింది. మధ్యాహ్నం తర్వాత బీజేపీ అభ్యర్థికి ఎక్కువ ఓట్లు రావడంతో ఆయనే ముందు నిలిచారు. మహబూబ్‌నగర్ స్థానంలో బీజేపీ అభ్యర్థి మొదటి నుంచి అతి తక్కువ మెజార్టీతో కొనసాగారు. ప్రతి రౌండ్‌లోనూ బీజేపీ అభ్యర్థి డీకే అరుణ స్వల్ప ఓట్ల ఆధిక్యతను ప్రదర్శించారు. అటూ ఇటుగా ఫలితం మారే అవకాశం ఉండటంతో రాష్ట్రంలో ఈ సీటుపై అసక్తి నెలకొన్నది. చివరివరకు అదే ఉత్కంఠ కొనసాగింది. చివరికి డీకే అరుణ స్వల్ప ఆధిక్యతతో గెలిచినట్టు ఎన్నికల సంఘం ప్రకటించింది.

## 17 స్థానాల్లో గెలిచిన అభ్యర్థులు, మెజార్టీ వివరాలు

| స్థానం | గెలిచిన అభ్యర్థి (పార్టీ) సాధించిన ఓట్లు | సమీప ప్రత్యర్థి (పార్టీ) సాధించిన ఓట్లు | మూడో స్థానం(పార్టీ) అభ్యర్థి సాధించిన ఓట్లు | మెజార్టీ |
|---|---|---|---|---|
| ఆదిలాబాద్ | గోడెం నగేశ్ (బీజేపీ) 5,68,168 | అత్రం సుగుణ (కాంగ్రెస్) 4,77,516 | అత్రం సక్కు (బీఆర్ఎస్) 1,37,300 | 90,652 |
| పెద్దపల్లి | జీ వంశీకృష్ణ(కాంగ్రెస్) 4,75,587 | జీ శ్రీనివాస్ (బీజేపీ) 3,44,223 | కొప్పుల ఈశ్వర్ (బీఆర్ఎస్) 1,93,356 | 1,31,364 |
| నిజామాబాద్ | డీ అరవింద్ (బీజేపీ) 5,92,318 | టీ జీవన్‌రెడ్డి (కాంగ్రెస్) 4,83,077 | బాజిరెడ్డి గోవర్ధన్ (బీఆర్ఎస్) 1,02,406 | 1,09,241 |
| కరీంనగర్ | బీ సంజయ్ (బీజేపీ) 5,85,116 | వీ రాజేందర్‌రావు (కాంగ్రెస్) 3,59,907 | బీ వినోద్‌కుమార్ (బీఆర్ఎస్) 2,82,163 | 2,25,209 |
| జహీరాబాద్ | సురేశ్ షెట్కార్ (కాంగ్రెస్) 5,28,147 | బీబీ పాటిల్ (బీజేపీ) 4,81,973 | గాలి అనిల్ కుమార్ (బీఆర్ఎస్) 1,71,997 | 46,174 |
| మెదక్ | ఎం రఘునందన్‌రావు (బీజేపీ) 4,71,217 | నీలం మధు (కాంగ్రెస్) 4,32,078 | పీ వెంకట్రామిరెడ్డి (బీఆర్ఎస్) 3,96,790 | 39,139 |
| మల్కాజిగిరి | ఈటల రాజేందర్ (బీజేపీ) 9,91,042 | పీ సునితారెడ్డి (కాంగ్రెస్) 5,99,567 | రాగిడి లక్ష్మారెడ్డి (బీఆర్ఎస్ ) 2,98,697 | 3,91,475 |
| చేవెళ్ల | కొండా విశ్వేశ్వర్‌రెడ్డి (బీజేపీ) 8,09,882 | రంజిత్‌రెడ్డి (కాంగ్రెస్) 6,36,985 | కాసాని జ్ఞానేశ్వర్ (బీఆర్ఎస్) 1,78,968 | 1,72,897 |
| సికింద్రాబాద్ | జీ కిషన్‌రెడ్డి (బీజేపీ) 4,73,012 | దానం నాగేందర్ (కాంగ్రెస్) 4,23,068 | టీ పద్మారావు (బీఆర్ఎస్) 1,29,586 | 49,944 |
| హైదరాబాద్ | అసదుద్దీన్ ఒవైసీ (ఎంఐఎం) 6,61,981 | కే మాధవిలత (బీజేపీ) 3,23,894 | ఎండీ వలిఉల్లా సమీర్ (కాంగ్రెస్) 62,962 | 3,38,087 |
| మహబూబ్‌నగర్ | డీకే అరుణ (బీజేపీ) 5,10,747 | వంశీచంద్‌రెడ్డి (కాంగ్రెస్) 5,06,247 | మన్నె శ్రీనివాస్‌రెడ్డి (బీఆర్ఎస్) 1,54,792 | 4,500 |
| నాగర్‌కర్నూలు | మల్లు రవి (కాంగ్రెస్) 4,65,072 | పీ భరత్‌ప్రసాద్ (బీజేపీ) 3,70,658 | ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ (బీఆర్ఎస్) 3,21,343 | 94,414 |
| నల్లగొండ | కే రఘువీర్‌రెడ్డి (కాంగ్రెస్) 7,84,337 | ఎస్ సైదిరెడ్డి (బీజేపీ) 2,24,432 | కంచర్ల కృష్ణారెడ్డి (బీఆర్ఎస్) 2,18,417 | 5,59,905 |
| భువనగిరి | కిరణ్‌కుమార్‌రెడ్డి (కాంగ్రెస్) 6,29,143 | బూర నర్సయ్య (బీజేపీ) 4,06,973 | క్యామ మల్లేశ్ (బీఆర్ఎస్) 2,56,187 | 2,22,170 |
| వరంగల్ | కడియం కావ్య (కాంగ్రెస్) 5,81,294 | అరూరి రమేశ్ (బీజేపీ) 3,60,955 | ఎం సుధీర్‌కుమార్ (బీఆర్ఎస్) 2,32,033 | 2,20,339 |
| మహబూబాబాద్ | బలరాంనాయక్ (కాంగ్రెస్) 6,12,350 | మాలోతు కవిత (బీఆర్ఎస్) 2,63,322 | సీతారాంనాయక్ (బీజేపీ) 1,10,341 | 3,49,028 |
| ఖమ్మం | ఆర్ రఘురామిరెడ్డి (కాంగ్రెస్) 7,66,929 | నామా నాగేశ్వర్‌రావు (బీఆర్ఎస్) 2,99,082 | టీ వినోద్‌రావు (బీజేపీ) 1,18,636 | 4,67,847 |

## లోక్‌సభ ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థులు

రాష్ట్రంలోని 17లోక్‌సభ స్థానాల్లో బీజేపీ, కాంగ్రెస్ చెరి 8 స్థానాల చొప్పున గెలుపొందాయి. ఒక స్థానంలో ఎంఐఎం గెలుపొందింది. ఆ అభ్యర్థులు, పార్టీల వివరాలు ఈ విధంగా ఉన్నాయి.


జీ కిషన్‌రెడ్డి (బీజేపీ)


బండి సంజయ్ (బీజేపీ)


ఈటల రాజేందర్ (బీజేపీ)


ధర్మపురి అర్వింద్ (బీజేపీ)


డీకే అరుణ (బీజేపీ)


రఘునందన్‌రావు (బీజేపీ)


కొండా విశ్వేశ్వర్‌రెడ్డి (బీజేపీ)


జీ నగేశ్ (బీజేపీ)


రఘురాంరెడ్డి (కాంగ్రెస్)


కడియం కావ్య (కాంగ్రెస్)


బలరాం నాయక్ (కాంగ్రెస్)


గడ్డం వంశీకృష్ణ (కాంగ్రెస్)


మల్లు రవి (కాంగ్రెస్)


కే రఘువీర్‌రెడ్డి (కాంగ్రెస్)


కిరణ్‌కుమార్‌రెడ్డి (కాంగ్రెస్)


సురేశ్ షెట్కార్ (కాంగ్రెస్)


అసదుద్దీన్ ఒవైసీ (ఎంఐఎం)

# బీజేపీకి జైకొట్టిన ఉద్యోగులు

**అత్యధిక పోస్టల్ బ్యాలెట్ ఓట్లు కమలం గుర్తుకే • జహీరాబాద్‌లో ఓడినా బీజేపీ అభ్యర్థికే అధిక ఓట్లు**

హైదరాబాద్, జూన్ 4 (నమస్తే తెలంగాణ): లోక్‌సభ ఎన్నికల్లో ప్రభుత్వ ఉద్యోగులు బీజేపీకే జై కొట్టారు. రాష్ట్రంలో 2.15 లక్షల పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్ ఓట్లు పోలయ్యాయి. వీటిని పరిశీలిస్తే.. అత్యధిక స్థానాల్లో పోస్టల్ బ్యాలెట్ ఓట్లు బీజేపీ అభ్యర్థులకే వేసినట్టుగా అర్థమవుతున్నది. కాంగ్రెస్ అభ్యర్థులకు పోస్టల్ ఓట్లు బాగానే పడినప్పటికీ.. మొత్తంగా చూస్తే గెలుపొందిన బీజేపీ అభ్యర్థులకు అత్యధిక ఓట్లు వేసినట్టు తెలుస్తుంది. నల్లగొండలో కాంగ్రెస్ అభ్యర్థికి 12 వేల ఓట్లు, ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థికి 7 వేల ఓట్లు పోలయ్యాయి. జహీరాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థి గెలిచినా, బీజేపీకే ఎక్కువ పోస్టల్ బ్యాలెట్ ఓట్లు వచ్చాయి. చేవెళ్లలో గెలిచిన బీజేపీకి 11,365, మల్కాజిగిరిలో గెలిచిన బీజేపీకి 10,330 ఓట్లు పడ్డాయి. హైదరాబాద్‌లో గెలిచిన ఎంఐఎం అభ్యర్థికి 2,703 ఓట్లు పోల్ అయ్యాయి. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటేసిన ఉద్యోగులు.. ఐదు నెలల్లో తమ అసంతృప్తిని కాంగ్రెస్ ప్రభుత్వంపై ఓట్ల రూపంలో వ్యక్తం చేశారు. డీఏలు విడుదల చేయకపోవడం, పీఆర్సీపై ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో కాంగ్రెస్‌ను వ్యతిరేకించారు.

## హమ్మయ్య... రాష్ట్రంలో ఉప ఎన్నికల్లేవ్

హైదరాబాద్, జూన్ 4 (నమస్తే తెలంగాణ): లోక్‌సభ ఫలితాల్లో రాష్ట్రంలో మళ్లీ ఉప ఎన్నికలు నిర్వహించాల్సిన అవసరం లేకుండా ప్రజలు తీర్పు ఇచ్చారు. ఎమ్మెల్యేలుగా ఉన్న పద్మారావు, దానం నాగేందర్, ఎమ్మెల్సీగా ఉన్న వెంకట్రామిరెడ్డి ఎన్నికల్లో పోటీ చేశారు. పద్మారావు, దానం సికింద్రాబాద్ నుంచి పోటీ చేయగా, వెంకట్రామిరెడ్డి మెదక్ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. దీంతో మరో ఉప ఎన్నిక అవసరం లేకుండా పోయింది.

## కమలం 'రెట్టింపు' వికాసం

- ఎనిమిది స్థానాల్లో బీజేపీ విజయం
- బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో భిన్న వాతావరణం


హైదరాబాద్, జూన్ 4 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో బీజేపీ డబుల్ బొనాంజా కొట్టింది. 2019 ఎన్నికల్లో నలుగురు ఎంపీలు గెలువగా.. ఈ దఫా సిట్టింగ్ స్థానాలతో పాటు మరో నాలుగు సీట్లలో పాగావేసింది. తద్వారా కమలం వికాసం 'రెట్టింపు' అయ్యిందని పార్టీ వర్గాలు చెప్తున్నాయి. 2019 ఎన్నికల్లో సికింద్రాబాద్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ స్థానాలను బీజేపీ గెలుచుకోగా, ఈసారి అదనంగా మల్కాజిగిరి, మెదక్, మహబూబ్‌నగర్, చేవెళ్ల నియోజకవర్గాల్లోనూ విజయం సాధించింది. దీంతో రాష్ట్రంలో ప్రస్తుతం బీజేపీకి ఎనిమిది మంది ఎమ్మెల్యేలు, ఎనిమిది మంది ఎంపీలు ఉన్నారు. ఫలితాల నేపథ్యంలో బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో భిన్న వాతావరణం కనిపించింది. ఉదయమే రెండు భారీ స్క్రీన్లను ఏర్పాటు చేసి లైవ్ టెలికాస్ట్ చేశారు.

## ప్రజల మద్దతు కాంగ్రెస్‌కే

- ఫలితాలు ఆత్మస్థైర్యం పెంచాయి
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, జూన్ 4(నమస్తే తెలంగాణ): ఎనిమిది ఎంపీ స్థానాలతో పాటు కంటోన్మెంట్ అసెంబ్లీకి జరిగిన ఉప ఎన్నికలో కాంగ్రెస్‌కు విజయం అందించిన ప్రజలకు సీఎం రేవంత్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ఫలితాలపై స్పందించిన ఆయన పత్రికా ప్రకటన జారీచేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ 100 రోజుల పాలనను ఆశీర్వదిస్తూ ఎనిమిది లోక్‌సభ స్థానాలతో పాటు కంటోన్మెంట్ శాసనసభ ఉపఎన్నికలో విజయం చేకూర్చారని పేర్కొంటూ రాష్ట్ర ప్రజలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ విజయంతో అందించిన ఆశీర్వాదాలు తమలో ఆత్మస్థైర్యాన్ని పెంచాయని అన్నారు. ఈ ఫలితాలు మరింత సమర్థ పాలన అందించేందుకు ఉత్సాహాన్నిచ్చాయని తెలిపారు. ప్రజల మద్దతు కాంగ్రెస్ పార్టీకే ఉన్నదన్న విషయాన్ని ఈ ఫలితాలు మరో సారి రుజువు చేశాయని స్పష్టంచేశారు. కాంగ్రెస్ విజయానికి పనిచేసిన కార్యకర్తలు, నాయకులు, శ్రేయోభిలాషులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల కోడ్ ముగుస్తుందని, ఇక రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పాలన అందిస్తామని తెలిపారు.

## లోకం పోకడ




## టీడీపీ కార్యాలయానికి మంత్రి తుమ్మల

**ఆ పార్టీ శ్రేణులకు ప్రత్యేక అభినందనలు**

ఖమ్మం, జూన్ 4 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన శాసనసభ, పార్లమెంట్ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఘన విజయం సాధించిన సందర్భంగా ఖమ్మంలో టీడీపీ శ్రేణులు మంగళవారం విజయోత్సవ ర్యాలీలు నిర్వహించాయి. టీడీపీ నాయకులు, కార్యకర్తలు నగరంలోని పలు ప్రాంతాల్లో ప్రదర్శనలు నిర్వహించి ర్యాలీగా పార్టీ కార్యాలయానికి చేరుకుంటుండగా.. అటువైపు నుంచి వెళ్తున్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వారిని గమనించి టీడీపీ కార్యాలయానికి వెళ్లారు. ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ విజయం సాధించడం అభినందనీయమని పార్టీ శ్రేణులను తుమ్మల ప్రత్యేకంగా అభినందించారు. నాయకులతో కరచాలనం చేసి కొద్దిసేపు ముచ్చటించారు. తుమ్మలను చూసిన టీడీపీ శ్రేణులు రెట్టించిన ఉత్సాహంతో నినాదాలు చేశాయి. పార్టీ కార్యాలయంలోకి ఆయనను సాదరంగా ఆహ్వానించాయి.


ఖమ్మం టీడీపీ కార్యాలయంలోకి మంత్రి తుమ్మలను ఆహ్వానిస్తున్న ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు

# ఫలితాలు చూసి ఆశ్చర్యపోయా!

- ఇలా వస్తాయని ఊహించలేదు
- రైతులు, అక్కాచెల్లెళ్ల ప్రేమ ఏమైందో తెలియదు
- మంచి చేసినా ఓడిపోయాం
- ప్రతిపక్షం కొత్తకాదు.. పోరాడటం కొత్తకాదు
- బీజేపీ, చంద్రబాబు, పవన్‌కు అభినందనలు
- ప్రజల తీర్పును అంగీకరిస్తున్నాం: జగన్



హైదరాబాద్, జూన్ 4 (నమస్తే తెలంగాణ): ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపై సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి భావోద్వేగానికి గురయ్యారు. ఫలితాల ముగిసిన అనంతరం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో జగన్ మీడియా సమావేశం నిర్వహించారు. తీవ్ర భావోద్వేగానికి గురైన జగన్.. గద్గద స్వరంతో మాట్లాడుతూ ప్రజాతీర్పును అంగీకరిస్తున్నట్టు చెప్పారు. ఫలితాలు చూస్తుంటే ఆశ్చర్యమేస్తున్నదని, ఇలాంటి ఫలితాలు వస్తాయని ఊహించలేదని అన్నారు. 'అమ్మ ఒడి అందుకున్న 53 లక్షల మంది తల్లులకు మ ంచి చేశాం. పిల్లలు బాగుండాలని, వారి చదువులు బాగుండాలని అడుగులు వేశాం. ఆ అక్కచెల్లెమ్మల ఓట్లు ఏమయ్యాయో తెలీదు. 66 లక్షల మంది అవ్వాతాతలు, వితంతువు లు, దివ్యాంగులకు మంచి చేశాం. వారి కష్టా ల్లో తోడుగా ఉంటూ, వారి ఇంటికే పింఛన్లు అందించే వ్యవస్థను తీసుకొచ్చాం. చాలీచాలని పింఛనును పెంచి మంచి చేసినా ఆ అవ్వాతాతల ఆప్యాయత ఏమైందో తెలియదు. దాదాపు కోటి మంది పొదుపు సంఘాల అక్కాచెల్లెమ్మలకు అండగా ఉన్నాం. ఆసరా, సున్నా వడ్డీ, చేయూతలతో వారికి తోడుగా నిలిచాం. ఆ కోటీ 5 లక్షల మంది అక్కాచెల్లెమ్మల ప్రేమాభిమానాలు ఏమయ్యాయో! తెలీదు. 54 లక్షల మంది రైతన్నలకు గతంలో ఎప్పుడూచూడని విధంగా పెట్టుబడి సాయం అందించాం. రైతు భరోసాతో అండగా నిలిచాం. పంటల బీమా, ఉచిత విద్యుత్తు అందించాం. ఆ రైతన్నల ప్రేమ ఏమైందో తెలీదు.' అని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమిలోని చంద్రబాబుకు, పవన్‌కల్యాణ్‌కు అభినందనలు తెలిపారు.

### టీటీడీ చైర్మన్ పదవికి భూమన రాజీనామా

హైదరాబాద్, జూన్ 4 (నమస్తే తెలంగాణ): ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ ఓటమి చెందటంతో తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ పదవికి భూమన కరుణాకర్‌రెడ్డి రాజీనామా చేశారు. మంగళవారం సాయంత్రం తన రాజీనామా లేఖను టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డికి అందజేశారు.

# ఏపీలో కూటమి సునామీ

- 165 స్థానాల్లో ఎన్డీయే గెలుపు
- ఏపీ చరిత్రలోనే మెజార్టీ విజయం
- 100 శాతం సీట్లు గెలిచిన జనసేన
- 11 సీట్లతో వైసీపీ ఘోర పరాజయం
- ఒక్కరు తప్ప మంత్రులంతా ఓటమి
- 21 ఎంపీ సీట్లు కూటమి కైవసం
- 4 సీట్లకే పరిమితమైన వైసీపీ



హైదరాబాద్, జూన్ 4 (నమస్తే తెలంగాణ): ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి చరిత్ర సృష్టించింది. మొత్తం 175 అసెంబ్లీ స్థానాలకుగానూ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఏకంగా 165 సీట్లు గెలిచింది. సుమారు 94 శాతం సీట్లు సాధించి దేశంలోనే సంచలనం రేపింది. ఏపీ చరిత్రలోనే ఇది భారీ మెజార్టీ కాగా వైసీపీ కేవలం 11 సీట్లకే పరిమితమైంది. ఈ విజయంతో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు నాలుగోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. మంగళవారం సాయంత్రం చంద్రబాబు మంగళగిరిలోని జనసేన కార్యాలయానికి వెళ్లారు. ప్రభుత్వ ఏర్పాటు, ప్రమాణ స్వీకారం తదితర అంశాలపై చర్చించారు. పార్లమెంట్ ఎన్నికల్లోనూ 25 నియోజకవర్గాలకు ఏకంగా 21 సీట్లను కూటమి కైవసం చేసుకున్నది. టీడీపీ 16, బీజేపీ 3, జనసేన 2 స్థానాలు గెలుచుకున్నాయి. జగన్మోహన్ రెడ్డి తన రాజీనామాను గవర్నర్‌కు పంపగా ఇప్పటికే ఏపీలో కొత్త ప్రభుత్వ ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమైంది. పోలీసులు చంద్రబాబు ఇల్లు, టీడీపీ కార్యాలయాల వద్ద భద్రత పెంచారు. కాన్వాయ్‌ని సిద్ధం చేస్తున్నారు. చంద్రబాబు బుధవారం ఢిల్లీ వెళ్లి ఎన్డీయే కూటమి సమావేశంలో పాల్గొననున్నారు.

### టీడీపీకి సొంతంగా..


ఏపీలో మ్యాజిక్ ఫిగర్ 88 కాగా టీడీపీ 144 సీట్లలో పోటీ చేసి 135 చోట్ల విజయం సాధించింది. దీనిద్వారా సొంతంగానే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే సంఖ్యను సాధించింది. మిత్ర పక్షాలైన జనసేన 21 చోట్ల పోటీ చేసి అన్నిచోట్లా గెలుపొందగా, బీజేపీ 10 స్థానాల్లో పోటీ చేసి 8 సీట్లలో గెలిచి ఉనికి చాటుకున్నది. ఈ ఎన్నికల్లో 'వై నాట్ 175' అంటూ ప్రచారం చేసిన వైసీపీ బొక్కబోర్లా పడింది. కంచుకోట రాయలసీమ బద్ధలుకాగా, కోస్తాంధ్రలో పూర్తిగా తుడిచిపెట్టుకుపోయింది. ఉత్తరాంధ్ర కూడా ఆదుకోలేదు. దీంతో వైసీపీకి కనీసం ప్రతిపక్ష హోదా కూడా దక్కలేదు. పార్టీల అధినేతల్లో చంద్రబాబు నాయుడు కుప్పంలో 47వేల ఓట్లతో, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ మంగళగిరిలో 91వేలతో, పిఠాపురంలో పవన్ కల్యాణ్ 69,169 ఓట్లతో, పులివెందులలో వైఎస్ జగన్ 61,176 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.

### 8 ఉమ్మడి జిల్లాలు క్లీన్‌స్వీప్

ఏపీలో మొత్తం 13 ఉమ్మడి జిల్లాలకుగానూ 8 జిల్లాలను కూటమి క్లీన్‌స్వీప్ చేసింది. ఎనిమిది జిల్లాల్లో కలిపి 110 సీట్లు ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లాలోని 10 నియోజకవర్గాలు, విజయనగరం జిల్లాలో 9, తూర్పుగోదావరి జిల్లాలో 19, పశ్చిమగోదావరి జిల్లాలో 15, కృష్ణా జిల్లాలో 16, గుంటూరు జిల్లాలో 17, అనంతపురం జిల్లాలో 14, నెల్లూరు జిల్లాలో 10 నియోజకవర్గాలు కూటమికే జై కొట్టాయి. ఉభయ గోదావరి జిల్లాల్లో ఎక్కువ సీట్లు గెలిచే పార్టీయే అధికారంలోకి వస్తుందన్న అంచనాలు మరోసారి నిజమయ్యాయి. వైసీపీ విశాఖపట్నం, ప్రకాశం, కడప, కర్నూలు, చిత్తూరు జిల్లాలకే పరిమితమైంది. ఐదు జిల్లాల్లో 65 నియోజకవర్గాలుండగా 55 సీట్లు కూటమి గెలుచుకోవడం విశేషం. కడపలో 3, విశాఖ, కర్నూలు, చిత్తూరు జిల్లాల్లో రెండు చొప్పున, ప్రకాశం జిల్లాలో ఒక స్థానాన్ని వైసీపీ గెలిచింది. వైసీపీ ప్రభుత్వంలో పనిచేసిన మంత్రులంతా ఓటమిపాలయ్యారు. జగన్, పెద్దిరెడ్డి తప్ప అందరూ ఓడిపోవడం గమనార్హం. ఇందులో ధర్మాన ప్రసాదరావు, బొత్సా సత్యనారాయణ, అంబటి రాంబాబు, కొడాలి నాని, అనిల్ కుమార్ యాదవ్, ఆర్కే రోజా, జోగి రమేశ్, తానేటి వనిత వంటివారున్నారు. పవన్ కల్యాణ్ పిఠాపురం నుంచి బరిలో దిగి విజయఢంకా మోగించారు. తక్కువ స్థానాల్లో పోటీ చేసి 98 శాతం స్ట్రైక్ రేటు సాధించాలని భావిస్తున్నాం' అని చెప్పారు. పవన్ అంచనాలను నిజం చేస్తూ 98 శాతం కాదు.. ఏకంగా 100 శాతం స్ట్రైక్‌రేట్‌తో జనసేన రికార్డు సృష్టించింది.

# వైసీపీని ఇబ్బంది పెట్టం!

- ఏపీ భవిష్యత్తుకు పునాది వేస్తాం
- జనసేన అధినేత పవన్‌కల్యాణ్



హైదరాబాద్, జూన్ 4(నమస్తే తెలంగాణ) ఎన్నికల్లో తాము విజయం సాధించినా భవిష్యత్తులో వైసీపీని ఇబ్బంది పెట్టబోమని, ఇది కక్ష సాధింపు సమయం కాదని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. కూటమి విజయం అనంతరం కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతూ, ఇది ఐదు కోట్ల మంది పైచిలుకు ప్రజలకు సేవ చేసే సమయమని పేర్కొన్నారు. 'ఏపీ విభజన తర్వాత నుంచి మనం చీకట్లో నలుగుతూనే ఉన్నాం. ఆ రోజులు అయిపోయాయి. కూటమి ప్రభుత్వం జవాబుదారీతనంతో పనిచేస్తుంది. నా జీవితమంతా తిట్టించుకున్నా.. మాటలు పడ్డా.. భారత దేశంలో వందకు వందశాతం విజయం సాధించింది జనసేన పార్టీ' అని చెప్పారు. మార్పుకావాలనేది కోట్లాది మంది ప్రజల ఆకాంక్ష అని, అదే ఓటు ద్వారా స్పష్టం చేశారని తెలిపారు. ఏపీ బలమైన భవిష్యత్తుకు పునాది వేసే సమయం ఆసన్నమైందన్నారు. తాను ఏరు దాటాక తెప్ప తగలేసే మనిషిని కాదని చెప్పారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ పథకాన్ని ఏడాదిలోగా అమలు చేసేందుకు ప్రయత్నిస్తానని, మెగా డీఎస్సీ తీసుకొచ్చే బాధ్యత తీసుకుంటామని హామీ ఇచ్చారు. తనకు ప్రజలు పెద్ద బాధ్యత ఇచ్చారని, 175 సీట్లు గెలిస్తే ఎంత బాధ్యత ఉంటుందో 21కి 21 సీట్లు గెలిస్తే కూడా అంతే బాధ్యత ఉంటుందని పేర్కొన్నారు. రాజకీయ ప్రమేయం లేకుండా అధికారులకు పనిచేసే స్వేచ్ఛనిస్తామని, రైతులకు ఇబ్బందుల్లేని ప్రభుత్వాన్ని అందిస్తామని చెప్పారు. తనను గెలిపించిన పిఠాపురం ప్రజలందరికీ, పెద్దలకు, ఆడపడుచులు, అక్కాచెల్లెళ్లకు, యువతకు కృతజ్ఞతలు అని ఆయన తెలిపారు.

## మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ పవన్ కల్యాణ్

- అన్నగా నా హృదయం ఉప్పొంగుతుంది
- గాయపడిన రాష్ట్రాన్ని గాడిన పెట్టండి
- చంద్రబాబు, పవన్‌కు చిరంజీవి శుభాకాంక్షలు



హైదరాబాద్, జూన్ 3 (నమస్తే తెలంగాణ): ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ సాధించిన విజయంపై ప్ర ముఖ నటుడు చిరంజీవి సోషల్ మీడియా వేదికగా ఆనందం వ్యక్తం చేశారు. 'డియర్ కల్యాణ్ బాబు..ఎక్కడ నెగ్గాలో, ఎక్కడ తగ్గాలో తెలిసిన నిన్ను తగ్గావని ఎవరు అనుకున్నా.. అది ప్రజలని నెగ్గించటానికే అని నిరూపించావ్. నిన్ను చూస్తుంటే ఓ అన్నగా గర్వంగా ఉంది. నువ్వు 'గేమ్ చేంజర్' మాత్రమే కాదు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ కూడా అని అందరూ నిన్ను కొనియాడుతుంటే నా హృదయం ఉ ప్పొంగుతుంది. నీ కృషి, నీ త్యాగం, నీ ధ్యేయం, నీ సత్యం జనం కోసమే. ఈ అద్భుతమైన ప్రజా తీర్పు.. రాష్ట్ర భవిష్యత్తు కోసం, ప్ర జా సంక్షేమం కోసం, నీ కలల్ని, నువ్వు ఏర్పరచుకున్న లక్ష్యాన్ని ని జం చేసే దిశలో నిన్ను నడిపిస్తుందని ఆకాంక్షిస్తూ, ఆశీర్వదిస్తూ, శుభాభినందనలు. నువ్వు ప్రారంభించే ఈ కొత్త అధ్యాయంలో నీకు శుభం కలగాలని, విజయం సాధించాలని మనస్ఫూర్తిగా ఆశిస్తున్నా' అని చిరంజీవి ఎక్స్‌లో పేర్కొన్నారు. చరిత్రలో అరుదైన విజయాన్ని అందుకున్నారని చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలిపారు. రాజకీయ దురంధరులైన మీపై, పవన్, మోదీపై ప్రజల విశ్వాసాన్ని సంపూర్ణంగా నిలబెట్టుకొని, రాజధాని లేని, గాయపడిన రాష్ట్రాన్ని తిరిగి గాడినపెట్టి నంబర్‌వన్‌గా తీర్చిదిద్దుతారని ఆశిస్తున్నాను' అని ట్వీట్ చేశారు.

## 9న బాబు ప్రమాణస్వీకారం

హైదరాబాద్, జూన్ 3 (నమస్తే తెలంగాణ) : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు 9న ప్రమాణస్వీకారం చేయనున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి ఘన విజయం సాధించడంతో చంద్రబాబుకు నాలుగోసారి సీఎంగా అవకాశం దక్కింది. అమరావతి వేదికగా చంద్రబాబు ప్రమాణస్వీకార కార్యక్రమం జరగనుంది.

## జనసేన 100% స్ట్రైక్‌రేట్

హైదరాబాద్, జూన్ 4 (నమస్తే తెలంగాణ) : ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో పవన్ కల్యాణ్ నేతృత్వంలోని జనసేన పార్టీ సరికొత్త రికార్డు సృష్టించింది. పోటీ చేసిన 21 అసెంబ్లీ స్థానాల్లో గెలుపొందింది.

### 25 ఓట్లతో వైసీపీ అభ్యర్థి ఓటమి

ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసత్యసాయి జిల్లా మడకశిర వైసీపీ అభ్యర్థి లక్కప్ప 25 ఓట్ల తేడాతో ఓడిపోయారు. టీడీపీ అభ్యర్థి రాజుపై ఓటమిపాలయ్యారు. లక్కప్పకు 78,322 ఓట్లు రాగా, టీడీపీ అభ్యర్థికి 78,347 ఓట్లు పడ్డాయి.

## ఏపీని గాడిలో పెడతాం : లోకేశ్

హైదరాబాద్, జూన్ 4(నమస్తే తెలంగాణ): దారి తప్పిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని గాడిలో పెడతామని నారా లోకేశ్ పేర్కొన్నారు. ఎన్నికల ఫలితాలపై ఆయన స్పందిస్తూ ఏపీకి పూర్వవైభవం తెస్తామని తెలిపారు.

## చంద్రబాబు, పవన్‌కు శుభాకాంక్షలు

**కేసీఆర్, కేటీఆర్, హరీశ్, రేవంత్ అభినందనలు**

హైదరాబాద్, జూన్ 4(నమస్తే తెలంగాణ): ఏపీలో భారీ విజయం సాధించిన టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు అభినందనలు తెలిపారు. ఐదేండ్లపాలన విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు.

**రెండు రాష్ట్రాల మధ్య సత్సంబంధాలు : సీఎం రేవంత్**

చంద్రబాబు, పవన్‌కు శుభాకాంక్షలు తెలుపుతూ సీఎం రేవంత్‌రెడ్డి తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. ఇరు రాష్ట్రాల మధ్య సత్సంబంధాలు కొనసాగిస్తామని తెలిపారు.